# మధ్యవర్తుల మహిమలు

'ఈ మధ్యవర్తులెలాంటి వారంటే సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్ముల మనుకుంటూ వుంటారు. రాయబారాలు నడిపించి నప్పుడూ, సందేశాల నందించినప్పుడూ తమకి తామే సాటి అని వాళ్లవల్లే కార్యక్రమం అంతా నడుస్తుందనీ అహంభావంతో వుంటారు.

ముఖ్యంగా పెళ్ళిళ్లలో మధ్యవర్తిత్వం వహించిన ఈ పెద్ద మనుషులు ఆ పార్టీకి ఈ పార్టీకీ మధ్య ఒక అవగాహనని కల్పించడమో లేక ఒకరినొకరు పూర్తిగా పరిచయమయ్యేలా అనువైన వాతావరణాన్ని కల్పించడానికి బదులు ఒక్కోసారి వున్నవి లేనట్లూ లేనివి వున్నట్లూ కల్పించి చెప్పి రెండు పార్టీలకి పేచీలు పెడతారు. వాళ్లు సిగపట్లు పట్టుకుని పీకులాడుకుంటూ వుంటే చూసి ఆనందిస్తారు.

కొందరు మధ్యవర్తులు మొదట బాగానే వుంటారు. పెద్దరికం వహించి ఇరు పక్షాల వారికీ మధ్య సందేశ కర్తలుగా వ్యవహరించి అన్నీ ఏర్పాటు చేస్తారు. తీరా వాళ్లు ఎంతో ఐక్యతతో కలిసిపోయి చక్కగా వున్నప్పుడు మధ్య వాళ్ళ ప్రాధాన్యత తగ్గిపోతుందనేమో లేనిపోనివి చెప్పి పుల్లలు పెడుతూ వుంటారు. చెప్పుడు మాటలు ఎంత చేటంటే అసలువాళ్ళూ అయినవాళ్ళూ నచ్చచెప్పడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం వుండదు. మధ్యవర్తుల వల్ల పెళ్ళిళ్లూ, పేరంటాలు కుదిరాయని సంబర పడే వాళ్లే మధ్యవర్తుల వల్ల కొంపలు కూలాయని నెత్తీ నోరూ కొట్టుకునేవారు కూడా లేకపోలేదు. నీలా! నీకు తెలీదు. నా పెళ్ళికి రమణయ్య పంతులనే ఆయన మా నాన్నగారికీ మా మామగారికీ మధ్యవర్తిగా వున్నాడు. నేను చదివింది స్కూలు ఫైనలే అయితే బిఏ పాసయ్యాననీ ఫస్టు క్లాసొచ్చిందని చెప్పాట్ట. నాన్నకి ఖమ్మం దగ్గర రెండెకరాల పొలం వుంది. దానికి నలుగురు వాటా దారులున్నారు. అయితే మధ్యవర్తిగారు మాత్రం వాళ్లతోటి నాన్నకి ఇరవై ఎకరాల పొలం వుందని చెప్పాట్ట. "ఎందుకయ్యా అని చెప్పావు లేనిపోని అబద్ధాలు" అంటే ఫరవాలేదు సార్ వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యమన్నారు కదా అందుకనే అలా చెప్పాను. ఎలాగో అలాగ మన రాధమ్మ

పెళ్ళయిపోతే చాలు అన్నాట్ట. నాన్న లబో దిబో మని కొట్టుకుంటూ అబద్ధాలు చెప్పి పెళ్ళి చెయ్యవలసిన ఖర్మ నాకేం పట్టలేదు. అని చెప్పి వాళ్ళ దగ్గరకెళ్ళి ఉన్నదున్నట్టు చెప్పాట్ట. వాళ్లు మంచి వాళ్లు కాబట్టి తేలిగ్గా నవ్వేసి మీ ఆస్థి పాస్తులతో మాకేమీ సంబంధం లేదు. మాకు కట్నాల ప్రసక్తే లేదు. ఇక అమ్మాయి చదువు బిఏ. నా ఎమ్ఏనా, స్కూల్ ఫైనలేనా కూడా మాకనవసరం. అమ్మాయి ఉద్యోగం చెయ్యాల్సినంత అవసరం లేదు అని చెప్పాట్ట. దాంతో ఆ మధ్యవర్తికి స్వస్తి చెప్పడంవల్ల అతని ప్రాముఖ్యం తగ్గిపోయిందని తెలిసి అబ్బాయి ఏమంత మంచి ఉద్యోగంలో లేడనో, సిగరెట్లు తాగుతాడనో, వొక్కపొడి నముల్తాడనో ఇలా చిన్న చిన్న పితూరీలు చెబుతూ వుండేవాట్ట. రెండు పక్షాల వారు తేలిగ్గా నవ్వేసి అతని మాటల్ని లెక్క పెట్టే వారు కాదు గాబట్టి సరిపోయింది. లేకపోతే కొంపలు కూలిపోయి నట్టేగా. ఈ మధ్యవర్తి మహాశయులు ఇంతటితో ఆగక మంచి సమయం చూసి అలగడం ఆగ్రహించడం మొదలెడతారు. వారిని ముందుగా భోజనానికి పిలవలేదనో వడ్డన సరిగ్గా జరగలేదనో ఏదో ఒక కారణం వెతికి దెబ్బలాడడం మొదలెట్టి వారి ప్రాముఖ్యాన్ని చూపించుకుంటారు. దీనివల్ల ఎవరెవరి మనసు ఎన్ని విధాల బాధ పడుతుందో ఆలోచించరు. పైగా అటువంటి క్షణాలు జీవితంలో తిరిగి రావు. ఆ టైములో వాళ్లు చేసే తతంగం అసలు వాళ్ళని ఎంత గాయపరుస్తుందో ఆలోచించరు. అందుకే నీలా! నీ కూతురి పెళ్ళికి వాళ్లెవరికో చెప్పానని రాసినప్పుడు నువ్వు జాగర్తగా వుండడం కోసమే ఈ విషయాలన్నీ రాస్తున్నాను. నీలా ప్రతీ విషయం నువ్వు మీ ఆయనా స్వయంగా వెళ్ళి మాట్లాడుకోండి. ఉన్న విషయాలు ఉన్నవిగా మాట్లాడుకోవడానికి మధ్య వర్తులెందుకు? రాయబారాలెందుకు? అలా ఎవరికి వారు మాట్లాడుకుని వాళ్ళ వాళ్ళ కార్యక్రమాలు నిర్వహించుకుంటే ఈ మధ్యవర్తుల ప్రమేయం తగ్గిపోతుంది. పేచీలూ గొడవలూ లేకుండా కార్యక్రమం జరిగిపోతుంది. ఇది నా అనుభవం. అందుకే నీకూ సలహా ఇస్తున్నాను. మరోలా అనుకోకు. వెంటనే నువ్వు మీ శ్రీ వారు స్వయంగా వెళ్ళి మీరనుకున్న ఆసంబంధాన్ని ఖాయం చేసుకుని ఉత్తరం రాయి పెళ్ళికి తప్పకుండా వస్తాం! ఉంటా మరి!

*

# 'కమిషన్' వృత్తా? నేరమా?

సుందరమ్మగారు కాకినాడ నుంచి కూతుర్ని చూసి పోదామని వచ్చింది. చేరగానే ఉత్తరం రాయమన్న భర్త మాటలు జ్ఞాపకం వచ్చి మనుమరాలు సుమాంజలినడిగి కవరూ, కలం తెప్పించుకుని ఉత్తరం రాయడం పూర్తిచేసింది. ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యమని మనవడు బాబిగాడ్ని పిలిచి అడిగింది. వాడు అంతసేపు గోళీకాయలతోటీ, గిల్లీదండుతోటీ ఆడుకుంటువున్నా అమ్మమ్మ ఉత్తరం పోస్టు చెయ్యమనేసరికి కాళ్లు పీకుతున్నాయనో, నిద్దరొస్తోందనో సాకు చెబుతున్నాడే తప్ప వెళ్ళి పోస్టు చేసొస్తాననడం లేదు. 'ఒరేయ్ బాబిగా అమ్మమ్మ ఉత్తరం పోస్టు చేసిరామ్మా. నీకు క్యాడ్‌బరీస్ చాక్‌లేట్ ఇస్తాగా? అన్న తల్లి మాటలు విని చాక్లెట్‌కి సరిపడే డబ్బులు తీసుకొని దుంకుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. క్యాడ్‌బరీ లంచం ఇస్తే వెళ్ళేడు వాడు. అంతేకాదు ఏపని చెప్పినా అయితే నాకెంత కమిషన్ అంటాడు? ఆటోమేటిక్‌గా వాడు ఈ కమిషన్ అనేమాట లంచానికి ప్రతీకలా తయారయిందీ అంటే అతిశయోక్తి కాదు. కమిషన్ ఏజెంట్లకి అది వృత్తి కావచ్చు. భీమా శాఖ వారికో లేక మరో ఆర్గనైజ్‌డ్ సిబ్బందికో ఈ పని చేస్తే ఇంత శాతం అన్న మాట వృత్తిగా తీసుకోవచ్చును. కానీ అడుగడుగునా ప్రతీదానికీ ఈ పని చేస్తే నాకేమిస్తారు? అనే భావన మాత్రం వృత్తి కిందకాదు. నేరం కిందే వస్తుంది. ఇది మొదట్లో సరదాగా ప్రారంభమయినా రానురాను ఒక అలవాటుగా మారిపోయి తల్లీ బిడ్డల మధ్యా, భార్యాభర్తల మధ్యా, స్నేహితుల మధ్యా ఇక వారు వీరూ అనే తేడా లేకుండా అందరి మధ్యా ఇదొక అలవాటుగా మారిపోతుంది. మా ఫ్రెండ్ రజిత తన చెల్లెలికి తను కొన్న చీర చూపించి ఆ అమ్మాయి ఇది నాకెంతో నచ్చింది ఇలాటిదొకటి తెచ్చియ్యవూ అంటే "తప్పకుండా ఇస్తాను. మరి నాకెంత కమిషన్"? అంటూ చీర తెచ్చి ఇచ్చినందుకు ఒక బ్లౌజు పీసు తనకి నచ్చినది కొనుక్కుని నీకు తెచ్చి ఇచ్చినందుకు నేనది కమిషన్‌గా తీసుకున్నాను అంది. అంటే అలా ఏదో ఒకటి తీసుకోకపోతే వాళ్ళకి తృప్తిగా ఉండదన్నమాట. ఇలా

నిజ జీవితంలో ప్రతీదానికి కమిషన్ అంటూ ఏదో ఒకటి కొట్టేయ్యడం నన్నడిగితే నిజంగా పరమ ఘోరం?

ఈ అలవాటు అంటకుండా చూసుకోవాలి? పిల్లలకి పసితనంలోనే చాక్లెట్లని కమిషన్‌గా పెట్టి పని చేయించుకోవడం మానుకోవాలి? పిల్లలు ఇలా ప్రతిదానికీ కమిషన్లు తీసుకోవడం అలవాటైతే పెద్దయ్యాక కూడా అలాగే పెద్ద పెద్ద కమిషన్లకి ఆకర్షింపబడి అనవసరంగా అనర్థాలను కొని తెచ్చుకున్న వారై నానా బాధలూ పడతారు. అది నిజంగా తోటకూర సామెతే అవుతుంది.

వృత్తిరీత్యా వచ్చే కమిషనొక్కటే ధర్మమైనది కానీ ప్రవృత్తిగా మార్చుకున్న ఈ అలవాటు దోషమే అవుతుంది. సరదాగా మొదలయినా, సకల బాధలకూ గురిచేస్తుంది. చెడ్డపేరు సంపాదించి పెడుతుంది. ప్రేమతో, అభిమానంతో ఒకరికొకరు సాయపడవలసిన రక్త సంబంధాన్ని, స్నేహబంధాన్ని కూడా తుడిచేసి ఈ అలవాటు తనకి బానిసని చేసుకుంటుంది.

మనలో చాలామంది బోలెడు డబ్బెట్టి కొన్న కూరలకి ఒకటో అరో కొసర్లు అని కొసరి కొసరి తీసుకుంటారు. నిజానికి డబ్బులిచ్చి అన్నీ కొన్నాక ఆ కాస్తా ఏ తేడా కాదు కాకూడదు. కానీ ఆ కొసరు తీసుకుంటే తప్ప వీళ్ళకి తృప్తిలేదు. ఒక్కొక్కసారి ఆ కొసరువల్ల కొనే వాళ్ళకీ అమ్మేవాళ్ళకీ పెద్ద పెద్ద దెబ్బలాట అయిపోతాయి. ఈ కొసరనేది ఏదో కమిషన్ లాంటిదే? అదొక అలవాటన్న మాట?

ఏది ఏమైనా ఈ కమిషన్ల అలవాటుని నేరంగా భావించి మానుకోవడం ఉత్తమమైన లక్షణం. ముఖ్యంగా పసితనంలోనే పిల్లలకి కమిషన్ అంటూ ఆశలు పెట్టి ఉసిగొల్పడం ఉచితం కాదు. ఏమంటారు. ★